క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రౌతులపూడి: ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ శివరామకృష్ణయ్య తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండలంలోని మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

క్రీడా ప్రాంగణంలో తుప్పల తొలగింపు



తీర్చిదిద్దిన కోటనందూరు హైస్కూల్ క్రీడా ప్రాంగణం

సాక్షి ఇంపాక్ట్

కోటనందూరు: క్రీడాకారులకు అసౌకర్యంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో ఉన్న తుప్పలను సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఈ నెల 10న 'సాక్షి'లో 'క్రీడా ప్రాంగణం అధ్వానం' శీర్షికన వెలువడిన కథనంపై పాఠశాల యాజమాన్యం స్పందించింది. క్రీడా ప్రాంగణంలో భారీగా పేరుకుపోయిన తుప్పలను పూర్తిగా తొలగించారు. ఎత్తు పల్లంగా ఉన్న ప్రాంగణాన్ని పొక్లెయిన్‌తో చదునుగా చేసి తీర్చిదిద్దారు. శిథిలావస్థలో ఉన్న భవనాల తొలగింపునకు చర్యలు చేపట్టామని హెచ్‌ఎం వేణుగోపాల్ తెలిపారు. పాఠశాల యాజమాన్యం చర్యలపై విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, క్రీడాకారులు, వాకర్లు హర్షం వ్యక్తం చేశారు.

జీడిపిక్కల కార్మికుల ఆందోళన



ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఏలేశ్వరం: తమ డిమాండ్ల సాధన కోసం మండలంలోని చిన్నింపేట గ్రామంలో ఉన్న జీడిపిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు శుక్రవారం ఆందోళన చేశారు. కార్మికులు ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దువ్వా శేషుబాబ్జీ కార్మికులకు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, కార్మికులకు యాజమాన్యం న్యాయం చేయాలన్నారు. వారి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: కాకినాడకు చెందిన సిటీ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ స్థానిక సాంబశివ హాస్పటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వెద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు ముద్రగడ గిరిబాబు ప్రారంభించారు. సిటీ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టిమూరి చిన్నబాబు ఆధ్వర్యంలో శిబిరం కొనసాగింది. వివిధ సమస్యలతో వచ్చిన 210 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, సాంబశివ హాస్పటల్ అధినేత వేగి సాంబశివ, వైద్యులు బిందు, సీహెచ్ ప్రకాష్, సీహెచ్ రాఘవేంద్ర, కె.మహేష్, ఎం. విజయకుమార్ పాల్గొన్నారు.

అధికారుల సమాచారం

ఏలేశ్వరం:

తహసీల్దార్	– 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	– 98493 36599
ఎంఈఓ	– 94942 10420
ఏపీఓ	– 70939 98217
ఏపీఎం	– 73373 16825
ఎస్సై	– 94409 04835
మండల వైద్యాధికారి	– 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	– 96520 65430
మండల వ్యవసాయాధికారి	– 83310 56609
ఫారెస్టు రేంజర్	– 94403 28540

కిర్లంపూడి:

తహసీల్దార్	– 98499 03886
ఎంపీడీఓ	– 91009 70617
ఎంఈఓ	– 90009 12335
ఎంఈఓ–2	– 98487 43433
ఏపీఓ	– 83744 46309
ఏపీఎం	– 96523 04151
ఎస్సై	– 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	– 77024 41029
వీరవరం వైద్యాధికారి	– 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	– 81066 28018
మండల వ్యవసాయాధికారి	– 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	– 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	– 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	– 89789 41840
హౌసింగ్ ఏఈ	– 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	– 97014 77778

రబీకి రెడీ

- ముమ్మరంగా ఖరీఫ్ వరి కోతలు
- కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల ధాన్యం విక్రయాలు
- దాళ్వాపై దృష్టి సారించిన అన్నదాతలు

ఏలేశ్వరం: నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కొద్ది రోజులుగా రైతులు కోతలను ప్రారంభించి, ధాన్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 21 వేల హెక్టార్లల్లో ఖరీఫ్ పంట వేశారు. ఏలేశ్వరం మండలంలో 5,950 ఎకరాల్లో వేయగా, పంట కోతకు రావడంతో రైతులు బిజీగా ఉన్నారు. రైతులు ఎక్కువగా చెరువులు, బోర్ల నీటి ఆధారంగా వరిపంట వేయగా, సంపత్ స్వర్ణ, స్వర్ణ, ఆర్‌జీఎల్ 2538 రకాలు సాగు చేశారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, భద్రవరం, సిరిపురం తదితర గ్రామాల్లో ఎక్కువగా ఖరీఫ్ సాగు చేపట్టారు. కూలీల కొరత ఎక్కువగా ఉండడంతో.. యంత్రాలపై ఆధారపడుతున్నారు. కూలీల కొరతతో పాటు, కూలీ ధరలు ఎక్కువగా ఉండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటి వరకు మండలంలో 1,300 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి.

కొనుగోలు కేంద్రాల ద్వారా..



రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మకాలు సాగించాలి. దళారులను నమ్మి మోసపోవద్దు. ప్రస్తుతం రబీ సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు.
– బి.జ్యోతి, వ్యవసాయాధికారి, ఏలేశ్వరం

4,300 ఎకరాల్లో..

ఖరీఫ్ కోతలు జోరుగా సాగుతుండడంతో రైతులు రబీపై దృష్టి సారించారు. ఈ ఏడాది సుమారు 4,300 ఎకరాల్లో రబీ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఖరీఫ్ పంటను ఆర్బీకేల ద్వారా సుమారు మూడు వేల క్వింటాళ్లను కొనుగోలు చేశారు. రబీకి ఆర్ఎన్ఆర్, ఎంటీయూ 1156, 1121 రకాల విత్తనాలను వినియోగిస్తున్నారు.



కళ్లంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

యంత్రాలతో కోతలు

రైతులు దాళ్వా కోతలకు యంత్రాలపై ఆధారపడుతున్నారు. కోతల నుంచి నూర్పుల వరకు యంత్రాలు వేగంగా పనిచేయడంతో పాటు, ఖర్చు తక్కువగా ఉండడంతో రైతులు వాటివైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో ఈ ప్రాంత రైతులు ఎక్కువగా యంత్రాలపై ఆసక్తి చూపేవారు కాదు. అలాంటిది కూలీ ఖర్చులు గణనీయంగా పెరగడంతో ఈ ఏడాది యంత్రాలపై ఆధారపడాల్సి వస్తోంది.

అపరాలపై దృష్టి సారింపు

ఒకవైపు ఖరీఫ్ కోతలు ముమ్మరంగా కొనసాగుతుండడంతో రైతులు అపరాలపై దృష్టి సారించారు. ఈ ఏడాది 150 హెక్టార్లల్లో అపరాల సాగు చేపట్టేలా వ్యవసాయ శాఖ అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం రైతులకు మినుములు సబ్సిడీపై అందజేశారు. వీటిద్వారా రైతులు గిట్టుబాటు ధరతో పాటు, మేలు జరగనుంది. రైతులు అపరాల సాగుకు సిద్ధమవ్వాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



లింగంపర్తిలో ధాన్యం కొనుగోలు చేస్తున్న అధికారులు

ఖాతాలకు ఎన్‌పీసీఐ తప్పనిసరి



కేఓ మల్లవరంలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తుని రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సంక్షేమ పథకాలు అందాలంటే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఖాతా తప్పనిసరి అని కేఓ.మల్లవరం సచివాలయ కార్యదర్శి పైలా శివ స్పష్టం చేశారు. రోజ్‌గార్ దివస్ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్ఆర్ఈజీఎస్‌లో చేపట్టే పనులు, ఉపాధి మస్టర్లు, ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనాలు, జాబ్ కార్డుల జారీ, జాబ్‌కార్డుల్లో కుటుంబ సభ్యుల నమోదు, ఆధార్ లింక్డ్ పేమెంట్లకు పోస్టాఫీసుల్లో ఖాతాలు తెరవడంపై అవగాహక కల్పించారు. ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానం తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.

గూగుల్‌తో లైబ్రరీలకు తగ్గిన ప్రాధాన్యం



కార్యక్రమంలో పాల్గొన్న గ్రంథాలయ అధికారులు

గండేపల్లి: గ్రంథాలయాలకు గూగుల్ రాకతో ప్రాధాన్యం తగ్గిందని, ప్రస్తుతం ఏఐ రంగప్రవేశంతో వీటి ప్రాధాన్యం మరింత సన్నగిల్లిందని పలువురు వక్తలు అన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలోని గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ స్థాయి లైబ్రేరియన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జరిగింది. కార్యక్రమానికి వరంగల్ ఎన్ఐటీ డిప్యూటీ లైబ్రేరియన్ ఇరాన్ ఎం సెట్టర్, కిర్లోస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ పుణే లైబ్రేరియన్ ఆర్కే కిషోర్ పట్నాల, ఆదిత్య యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎస్ రమాశ్రీ, రిజిస్ట్రార్ జి సురేష్ అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పూర్వ గ్రంథాలయ వ్యవస్థకు, నేటి లైబ్రరీలకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె అశోక్‌కుమార్, వివిధ కళాశాలల నుంచి గ్రంథాలయ విభాగం అధికారులు పాల్గొన్నారు.

జనవరి 5న హిందూ శంఖారావం సభ

ప్రత్తిపాడు: విజయవాడలో వచ్చే ఏడాది జనవరి ఐదో తేదీన హిందూ శంఖారావం సభ జరుగుతుందని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా తెలిపారు. మండలంలోని పెద శంకర్లపూడిలో శుక్రవారం సాయంత్రం హిందూ శంఖారావం మండల సమావేశం జరిగింది. హిందూ ధర్మ రక్షా సమితి నాయకుడు కర్రి ధర్మరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ, ప్రతి ఇంటి నుంచి ఒక్కొక్క సభ్యుడు ఈ సభకు వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.



సభలో మాట్లాడుతున్న రాజా

ఉత్సాహభరితంగా డ్యాన్స్ పోటీలు



డ్యాన్స్ పోటీల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులు

తుని: రంగం యువజనోత్సవాల్లో భాగంగా స్థానిక రోటరీ క్లబ్ భవనంలో నిర్వహించిన డ్యాన్స్ పోటీలు ప్రేక్షకులను అలరించాయి. శుక్రవారం సాయంత్రం ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు డ్యాన్స్ ఫైనల్స్ నిర్వహించారు. తుని, పరిసర ప్రాంతాలకు చెందిన స్కూళ్ల నుంచి 24 జట్లు పాల్గొని, ప్రతిభను కనబరిచాయి. న్యాయనిర్ణేతలుగా దీప్తి, శేషారత్నం వ్యవహరించారు. క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు మంగరాజు, కార్యదర్శి వీర్రాజు, కోశాధికారి కిశోర్‌రెడ్డి, యూత్ యాక్టివిటీస్ చైర్మన్ డాక్టర్ నాగిరెడ్డి, గౌరీశంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

తుని: విశాఖపట్నంలో లా విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.రాము శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. యువతిని ప్రేమ పేరుతో వంచించి, సామూహిక లైంగిక దాడికి పాల్పడడం హేయమైన చర్య అని అభివర్ణించారు. ఈ చర్యను రాష్ట్ర ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలన్నారు. లైంగిక దాడుల ఘటనలపై కఠినమైన చట్టాలతో పాటు, వాటికి కారణమైన మద్యం, మత్తు పదార్థాలు, అశ్లీల సినిమాలు, వీడియోల నిరోధానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దళితులకు పరిహారం ఇవ్వాలి

తొండంగి: కోన ప్రాంతంలో పారిశ్రామిక అవసరాలకు భూములిచ్చిన దళిత రైతులకు పరిహారం ఇవ్వాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి తంతటి కిరణ్‌కుమార్ శుక్రవారం డిమాండ్ చేశారు. కొత్తపాకలు గ్రామంలో నిర్వహిస్తున్న నిరసన దీక్షకు ఆయన మద్దతు పలికారు. పారిశ్రామిక అవసరాలకు దళితులు భూములిచ్చారని, వారికి పరిహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.సూర్యారావు, డి.విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

ప్రత్తిపాడు: మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసుల్లో నిందితులకు ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను శుక్రవారం జరిమానా విధించారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం వారిని అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా, ఒక్కొక్కరికీ రూ.10 వేల వంతున జరిమానా విధించారు.

నిందితులకు జైలు, జరిమానా

జగ్గంపేట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడ్డ నిందితులకు జైలు, జరిమానా విధించినట్టు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేట సర్కిల్ పరిధిలో శుక్రవారం 8 మంది ఈ కేసుల్లో పట్టుబడ్డారన్నారు. వీరిలో ఐదుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా, ఇద్దరికి రూ.50 వేల చొప్పున జరిమానా, రెండు రోజుల జైలు, ఒకరికి ఒకరోజు జైలు శిక్ష విధించినట్టు తెలిపారు.

కొండబాబుకు సత్కారం

గండేపల్లి: ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబును వైస్ ఎంపీపీ కుంచే రాజా, నేతలు కుంచే రామకృష్ణ, పోశ్ని బాబురావు శుక్రవారం దుశ్శాలువాతో సత్కరించారు. ఆయనకు అభినందనలు తెలిపారు.

సారా బట్టీలపై దాడులు



ఎస్.పైడిపాలలో సారా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

రౌతులపూడి: ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కాకినాడ డిప్యూటీ కమిషనర్ వై.చైతన్యమురళి, అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న సారా బట్టీలపై అధికారులు శుక్రవారం దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఎస్.పైడిపాలలో నాటుసారాకు ఉపయోగించే 5,800 లీటర్ల బెల్లపు ఊటను, మెరక చామవరంలో 1,200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, పోలవరపు సింహాద్రి అనే వ్యక్తిని అరెస్టు చేశారు. శృంగవరంలో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీ, అమ్మకాలపై టోల్ ఫ్రీ నంబరు 08842376277కు కాల్ చేయవచ్చని అధికారులు వెల్లడించారు. సమాచారం ఇచ్చేవారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జయమానిక, తుని ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

ప్రత్తిపాడు: ఒమ్మంగి గ్రామంలో శుక్రవారం ఓ సారా విక్రేతను అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఒమ్మంగి గ్రామానికి చెందిన మట్టపర్తి రామకృష్ణను అదుపులోకి తీసుకుని, అతని వద్ద పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్టు చెప్పారు.



పెద మల్లాపురం గ్రామంలో సారా స్థావరంపై దాడి చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని శంఖవరం మండలం పెదమల్లాపురం గ్రామంలో సారా స్థావరాలపై భారీఎత్తున దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు. ఈ దాడిలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1,900 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

గండేపల్లి: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను అధికారులు పరిశీలించారు. ఎంపీడీఓ నాతి బుజ్జితో కలిసి, డ్వామా సహాయ పథక సంచాలకుడు ఎం.భానుప్రకాష్ శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షించారు. మేకలు, గొర్రెల షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. వీరి వెంట ఏపీఓ ఆర్ గంగాభవాని, ఈసీ పి.రమేష్ తదితరులు ఉన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



వనదుర్గమ్మ ఆలయం వద్ద ఉసిరి చెట్టును దర్శించుకుంటున్న ముద్రగడ పద్మనాభం

ఏలేశ్వరం: నిత్యం బిజీగా గడిపే వారంతా కార్తిక వన సమారాధనలో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. మహిళలు, పిల్లలు కుటుంబ సభ్యులతో రోజంతా రకరకాల ఆటలతో గడిపారు. పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని పొలంలో వన సమారాధన నిర్వహించారు. సమితి అధ్యక్షుడు ఎస్ విజయబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. సీనియర్ సభ్యుడు తాళ్లూరి గొల్లాజీరావును ఘనంగా సన్మానించారు. మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సమితి సభ్యుడు జ్యోతుల నాగసత్యశ్రీనివాస్ ఆర్థిక సహకారంతో వన భోజనాలు ఏర్పాటు చేశారు. తొలుత ఉసిరి చెట్టుకు జోగా నిత్యానందం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

బ్రహ్మకుమారీల వన సమారాధన

తుని రూరల్: తుని మండలం వి.కొత్తూరు సమీపంలో ప్రైవేట్ మామిడితోటలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా వన సమారాధన నిర్వహించారు. బ్రహ్మకుమారి మాధవీలత పర్యవేక్షణలో బ్రహ్మకుమారీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివలింగాన్ని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహించిన వినోద, ఆహ్లాద కార్యక్రమాలు అలరించాయి. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

ఘనంగా అన్న సమారాధనలు

కిర్లంపూడి: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక వనదుర్గమ్మ, జగపతినగరం కనకదుర్గమ్మ ఆలయాల వద్ద అన్న సమారాధనలు జరిగాయి. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం వనదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, గణేశుల రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.



ఏలేశ్వరంలో జరిగిన వన సమారాధనలో ఆటలు ఆడుతున్న మహిళలు



బ్రహ్మకుమారీల వన సమారాధనలో శివలింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ



ప్రత్తిపాడు సబ్ జైలులో ఖైదీలకు అందించే న్యాయ సహాయంపై సూచనలిస్తున్న ప్రకాష్‌బాబు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ జైలులోని రిజిస్టర్లను, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జైలులోని వంట శాల, జైలు గదులను, పరిసరాలను పరిశీలించారు. ఖైదీల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు న్యాయ సహాయం అందుతున్నదీ, లేనిదీ విచారించారు. ఖైదీలకు అందించే న్యాయ సహాయంపై సబ్ జైలు సూపరింటెండెంట్ ఎస్‌కే బాబు, ప్యానల్ అడ్వకేట్లకు సూచనలిచ్చారు. ఆయన వెంట జూనియర్ సివిల్ జడ్జి కాటం భాను, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ బుగత శివ, బార్ అసోసియేషన్ కార్యదర్శి బొంగుళూరి మధుబాబు, ప్యానల్ అడ్వకేట్లు అవసరాల దేవి, ప్రకాష్, కోర్టు లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి తదితరులున్నారు.

29న ఉమారామలింగేశ్వర కల్యాణోత్సవం

తొండంగి: మండలంలోని గోపాలపట్నంలో ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం ఈ నెల 29 నుంచి 30 వరకూ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ నిర్వాహకుడు యడ్ల శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 28న ఉమారామలింగేశ్వరుడు, పార్వతీ అమ్మవార్ల ఉత్సవమూర్తులను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా చేసి, పల్లకీపై గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారన్నారు. 29న రాత్రి ఎనిమిది గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం జరుగుతుందని చెప్పారు. అదే రోజు మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. 30న ఉంజల్‌సేవ, శ్రీపుష్పయాగ మహోత్సవం, వేద పండితాశీర్వచనం, నిరాజన మంత్రపుష్పాలతో కలాణోత్సవాలు ముగుస్తాయని వివరించారు.